నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 27 జూలై 2024 | RANGAREDDY



# బడులను ఊడ్చేదెవరు !

- స్కావెంజర్స్ లేక జిల్లాలో అపరిశుభ్రంగా పాఠశాలలు
- జిల్లాలో 1,309 ప్రభుత్వ పాఠశాలలు
- పరిశుభ్రతను పట్టించుకోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు
- విద్యార్థులు, ప్రైవేటు వ్యక్తులతో నెట్టుకొస్తున్న ఉపాధ్యాయులు



అంతప్పగూడ పాఠశాలలో చిన్నారి వాంతి చేసుకోవడంతో తల్లిని పిలిపించి శుభ్రం చేయించిన పాఠశాల సిబ్బంది

రంగారెడ్డి, జూలై 26(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత అటకెక్కుతున్నది. కనీసం పాఠశాలలను ఊడ్చేవారు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుభ్రం చేసేవారు లేక తరగతి గదులు, పాఠశాల ఆవరణలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో కలుపుమొక్కలు, చెత్తాచెదారంతో నిండుతున్నాయి. జిల్లాలోని 1,309 ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్స్ లేక ఈ పరిస్థితి నెలకొన్నది. అపరిశుభ్ర వాతావరణంలోనే విద్యార్థులు తరగతులకు హాజరుకావాల్సిన దుస్థితి ఏర్పడింది.

### పరిశుభ్రత పాఠాలకే పరిమితం..

గత పదేండ్లలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట సదుపాయాలు ఒనగూరుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతున్నది. పాఠశాలల ఆవరణలు అపరిశుభ్రంగా మారుతుండగా.. మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. పరిసరాల పరిశుభ్రత పాఠాల వరకే పరిమితమవుతున్నది. అపరిశుభ్రత కారణంగా తమ పిల్లలు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

### పట్టించుకోని పారిశుద్ధ్య కార్మికులు..

మల్టీపర్పస్ సిబ్బంది స్థానంలో మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లో మల్టీపర్పస్ సిబ్బందితో పాఠశాలలను శుభ్రపర్చుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే మున్సిపాలిటీలు, పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడం, ఉన్నచోట తరగతులు ప్రారంభమైన తర్వాత వస్తుండడంతో పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు.. కొన్నిచోట్ల పారిశుద్ధ్య కార్మికులు పాఠశాలలవైపే రావడంలేదన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇక చేసేదేమీ లేక సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే చొరవ చూపిస్తున్నారు. తలా ఇంత డబ్బులు పోగుచేసి ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని పారిశుద్ధ్య పనులను చేయించుకుంటున్నారు. అక్కడక్కడా విద్యార్థులు, వారి తల్లిదండ్రులే పాఠశాలలను శుభ్రం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

### వర్షాకాలంలో మరింత అధ్వానం..

ప్రస్తుత వర్షాకాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనగా.. వర్షం నీటితో పాఠశాలల పరిసరాలు కంపుకొడుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో కలుపు మొక్కలు, చెత్తాచెదారంతో పేరుకుపోతున్నాయి. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. ముమ్ముందు పరిస్థితి ఇలాగే కొనసాగితే.. విద్యార్థులు వ్యాధుల బారినపడే అవకాశం ఉన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



అంతప్పగూడ పాఠశాలలోని మరుగుదొడ్ల దుస్థితి



దోమ నుంచి అయినాపూర్ మీదుగా కోస్గి వెళ్లే బీటీ రోడ్డు



మర్పల్లి నుంచి కోట్ పల్లి వెళ్లే రోడ్డు మాల సోమారం చౌరస్తా వద్ద..

# అడుగుకో గుంత..

## నడిచేదెట్లా?



పెద్దేముల్ మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో చిత్తడి చిత్తడిగా మారిన రోడ్డు



ధారూరు మండలం దోర్నాల్ - నాగారం రోడ్డు

**అధ్వానంగా మారిన రోడ్లు**

వర్షాలకు దెబ్బతిన్న రహదారులు..

**మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం**

నరయాతన పడుతున్న వాహనదారులు



విఠలాపూర్ రోడ్డు

జిల్లాలో రోడ్లు అధ్వానంగా మారాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారులన్నీ దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతలు పడి, బురదమయమైన దారులే కనిపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీటితో నిండిన గుంతలు కుంటలను తలపిస్తున్నాయి. ఇక గ్రామాలు, తండాల్లో అయితే రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కిలోమీటర్ల మేర దారులు బురదతో నిండిపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధానంగా వికారాబాద్-మోమిన్‌పేట, మోమిన్‌పేట-మర్పల్లి, వికారాబాద్-కోట్‌పల్లి, బొంరాస్‌పేట నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే దౌల్తాబాద్ మండలం, తాండూరు-పెద్దేముల్, మోమిన్‌పేట్-శంకర్‌పల్లి రహదారుల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనూ పరిస్థితి అలాగే ఉన్నది. పాడైన రోడ్లతో ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఏడు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా రోడ్ల అభివృద్ధికి ఖర్చు చేయలేదని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

- వికారాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ)



తురుమామిడి -బంట్వారం రోడ్డు (ఆర్‌అండ్‌బీ)



పెద్దేముల్ గ్రామ శివారులోని బుద్దారం గ్రామానికి వెళ్లే దారిలో తాండూరు -సంగారెడ్డి ప్రధాన రహదారి



మర్పల్లి-పట్లూర్ మధ్యలో..



తాండూరు -జహీరాబాద్ (పీఆర్ రోడ్డు)



కులకచర్లలో అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళ్లే దారిలో గుంతపడి నిలిచిన వర్షం నీరు

## రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం

# కదంతొక్కిన విద్యార్థులు

**చేవెళ్లలో బీజాపూర్ రహదారిపై ధర్నా**

చేవెళ్లటౌన్, జూలై 26: ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలంటూ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలోని బీజాపూర్ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని.. తమ హక్కు అని అన్నారు. అవి విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మెగా డీఎస్సీ వేయాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్, నగర కార్యదర్శి మహిపాల్, ప్రదీప్, శివ, హరికృష్ణ, కిశోర్, నతీశ్, ప్రేమ్, రాఘవేందర్, అశ్విని, పూజిత, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కాగా, శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులను పోలీసులు దౌర్జన్యంగా ఈడ్చుకెళ్లారు.దీంతో విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



చేవెళ్లలోని బీజాపూర్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

ఆందోళన చేస్తున్న విద్యార్థులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు





## కాన్వాయ్ వచ్చే..

# పోలీసులు బెంబేలెత్తే

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ): అనుకున్న సమయం కంటే అరగంట ముందు శుక్రవారం మధ్యాహ్నం సీఎం కాన్వాయ్ సచివాలయం వైపు రావడంతో అటు సామాన్యులు.. ఇటు పోలీసులు ఇబ్బందులు పడ్డారు. అలాగే సీఎం కాన్వాయ్ ఆ ట్రాఫిక్‌ను ఛేదించుకుంటూ వెళ్లడం మరో ఎత్తు. హైదరాబాద్ పోలీసులు సమన్వయ లోపంతో పనిచేస్తున్నారనేదానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. జుబ్లీహిల్స్ వైపు నుంచి సచివాలయం వైపునకు మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం వస్తున్నాడంటూ అప్పటికే సెట్‌లో పోలీసులకు సమాచారం అందించారు. అయితే ముఖ్యమంత్రి అరగంట ముందే సచివాలయానికి బయలుదేరారు. ఆయా కూడళ్లలోకి సీఎం కాన్వాయ్ రావడంతో కంగుతిన్న పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు నానా తంటాలు పడ్డారు. అయితే సీఎం వచ్చే రూట్‌లో అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసులు మధ్యాహ్నం వేళల్లో నిద్రావస్థలో ఉండటంతో ట్రాఫిక్‌ను సముదాయించలేక ఇబ్బందులు పడ్డారనే విమర్శలు వస్తున్నాయి. సాధారణ ట్రాఫిక్‌ను పక్కకు పంపిస్తూ, సీఎం కాన్వాయ్‌ని మరో పక్కగా వెళ్లనిస్తూ అప్పటికప్పుడు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ చేయడానికి ఇబ్బందులు పడ్డారు. అటూ సీఎం సెక్యూరిటీ విభాగం, ఇటూ శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకోకపోవడం, అప్రమత్తంగా లేకపోవడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.